# పోషకాహారం లేకే దృష్టి లోపం

- నయనజ్యోతి ద్వారా విద్యార్థులకు కంటి పరీక్షలు
- ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రత్యేక చర్యలు
- కలెక్టర్ భారతిహోళికేరి

**మెదక్ కలెక్టరేట్:** పోషక పదార్థాల లోపం వల్లే విద్యార్థులకు చిన్నతనంలోనే దృష్టిలోపం సమస్యలు వస్తున్నాయని కలెక్టర్ భారతిహోళికేరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నయనజ్యోతి చిన్నారుల చూపునకు చేయూత కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ భారతిహోళికేరి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల్లో వస్తున్న దృష్టి లోపం సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు జిల్లాలో నయనజ్యోతి కార్యక్రమం ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. తరగతిలో వెనుక వరుసలో ఉన్న విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఉన్నా బోర్డుపై ఉపాధ్యాయులు రాసే అక్షరాలు సరిగ్గా గుర్తించక చదువులో వెనుకబడుతుంటారని, అలాంటి విద్యార్థులను గుర్తించి, దృష్టిలోపాన్ని సరిదిద్దేందుకు నయనజ్యోతి కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని 6 నుంచి పదో తరగతి వరకు చదివే 50 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన విద్యార్థులకు శస్త్ర చికిత్సలు సైతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన అఖిల కంటి దవాఖాన వైద్యుల సహకారంతో ఈ కార్యక్రమం జిల్లాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం కంటి పరీక్షలే కాకుండా రక్త పరీక్షలు సైతం నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం అమలు కోసం ప్రతి 200 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడి పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఇంట్లోని తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయుల వద్దే ఎక్కువ సమయం ఉంటారని, ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలుగా భావించి పరీక్షలు నిర్వహించాలన్నారు. అప్పుడే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కొంత మంది విద్యార్థుల దృష్టి లోపాలు బయటపడినా వారికి మేలు చేసిన సంతృప్తి మిగులుతుందన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే అంకుర్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 100 పాఠశాలల్లో సులభతర బోధన పద్ధతులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. డ్రాపౌట్స్ తగ్గించేందుకు సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ఉపాధ్యాయులు అన్నిరకాలుగా సహకరించి ప్రాథమిక స్థాయిలో విద్యావ్యవస్థ పటిష్టతకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నతనంలో లోపాలను గుర్తించినప్పుడు వాటిని నివారించడానికి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ నయనజ్యోతి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీపీఎం జగన్నాథ్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోళికేరి